క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిక



రాయపర్తి : మండలంలోని పెర్కవేడు, కొండాపురం గ్రామాలకు చెందిన కాంగ్రెస్, టీడీపీ కార్యకర్తలు బుధవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, గుగులోత్ జాజు నాయక్, ఎంపీటీసీ బండి అనూషరాజబాబు, బొమ్మెర వీరస్వామి, కోదాటి దయాకర్‌రావు, యాకయ్య, రాజు ఉన్నారు.

హెల్త్ కార్డుల పంపిణీ



నర్సంపేట రూరల్ : నర్సంపేట కోర్టులోని న్యాయవాదులకు బుధవారం హెల్త్ కార్డులను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేష్ యాదవ్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పోలీసులకు ఫిర్యాదు



పర్వతగిరి : నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి బీఆర్‌ఎస్ సభలో కాంగ్రెస్ వాళ్లు కనిపిస్తే గన్నులతో పేల్చేస్తామని చేసిన అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిని ఖండిస్తూ బుధవారం యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందికట్ల అనిల్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై వీరభద్రరావుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నీరటి ప్రశాంత్, పంతంగి దేవేందర్, రంజిత్, ప్రభాకర్, కుమార్, అఖిల్, చీకటి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఓకు వీడ్కోలు



నర్సంపేట రూరల్ : నర్సంపేట ఎఫ్‌ఆర్‌ఓగా పనిచేసి బదిలీపై వెళ్తున్న బల్లిడి రమేష్‌ను ములుగు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్ సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ సాధారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓ రవికిరణ్, వరంగల్ ఎఫ్‌ఆర్‌ఓ సదానందం, వరంగల్ ఫారెస్టు ఆఫీస్ సూపరింటెండెంట్, మిషన్ భగీరథ డీఈ ప్రవీణ్, వనప్రేమి గోక రామస్వామి, సుదర్శన్, డాక్టర్ మోహన్‌రావు, జయుడు, మెడతాటి కృష్ణారావు, సమ్మెట సురేష్ పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం



నెక్కొండ : మండలంలోని అలంకానిపేట పశువైద్యశాల పరిధిలోని పెద్దకొర్పోలు గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ మహ్మద్ మహబూబ్‌పాషా ప్రారంభించారు. ఈ శిబిరంలో ఆయన పాల్గొని, మాట్లాడుతూ.. పశువులు గర్భకోశ వ్యాధుల బారిన పడి మృత్యువాత పడుతాయన్నారు. శిబిరంలో సుమారు 40 పశువులకు పరీక్షలుచేసి, అవసరమైన మందులను ఉచితంగా అందించారు. పశువైద్యాధికారి మాధవి, నాగారం జేవీఓ మహ్మద్ పాషా, వీఏ జంపయ్య, గోపాల మిత్రలు ఎస్. భిక్షపతి, ఆర్.రాజు, ఎస్.రామరాజు, పశుమిత్ర ఎస్.అనిత, రైతులు పాల్గొన్నారు.

ఇంటింటా కాంగ్రెస్ ప్రచారం



ఖానాపురం : మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు హరిబాబుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మండలంలోని బుధరావుపేటలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఎల్లగౌడ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. నాయకులు ప్రశాంత్, మహేష్, వినోద్, శంకర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో 'అరూరి'

వర్ధన్నపేట : కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ మూడోసారి కేసీఆర్ సీఎం కావాలని వేంకటేశ్వరస్వామిని కోరుకున్నట్లు తెలిపారు.

పౌరహక్కుల దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

నెక్కొండ : పౌర హక్కులకు భంగం కల్గిస్తే పౌర హక్కుల పరిరక్షణ చట్టం -1955 ప్రకారం అంటరానితనం, శిక్షార్హులవుతారని తహసీల్దార్ రాజ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని నెక్కొండ ఎస్సీ కాలనీలో బుధవారం పౌర హక్కుల దినోత్సవాన్ని సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేయగా ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అత్యాచారాలు (అట్రాసిటీ) నిర్మూలనపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రాజ్యాంగం ప్రకారం సమాజంలో ప్రతి పౌరుడికి జీవించే హక్కు ఉందని, వారి హక్కులను పరిరక్షించాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఆయన పేర్కొన్నారు. దళితులకు ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆయన సూచించారు. బడుగు బలహీన వర్గాల వారి పట్ల వివక్ష చూపకూడదని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై షేక్ జానీపాషా, ఎంపీఓ పర్వీన్, ఏపీఎం శ్రీనివాస్, ఆర్‌ఐ నరేందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాసంతి, ఈఓ సదానందం, మాంకాల యాదగిరి, ఈదునూరి దిలీప్. కందిక చెన్నకేశవులు, వివిధ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

చెన్నారావుపేట : ప్రభుత్వం ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఆంగోతు భద్రయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పీఆర్‌సీ కమిటీని వెంటనే ప్రకటించి ఆదాయపు పన్ను పరిమితి రూ.8 లక్షలకు పెంచాలని కోరారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించినట్లు ఉద్యోగ ఉపాధ్యాయుల రెండో వేతన సవరణ పీఆర్‌సీ సంఘంను ఏర్పాటు చేసి నివేధిక వచ్చే వరకు ఐఆర్ మంజూరు చేయాలని జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఉద్యోగ సమస్యలపై సెప్టెంబర్ 1న ఇందిరా పార్కు వద్ద చేపట్టే ధర్నాను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యాకయ్య, కొమురయ్య, ఉమాశంకర్, రవి, కట్ట స్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపటి మహా ధర్నాను జయప్రదం చేయండి

సంగెం : ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద సెప్టెంబర్ 1న నిర్వహించ తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి సి.సుజన్ ప్రసాద్‌రావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ పోరాట కమిటీ ఆధ్వర్యంలో మూడు దశల పోరాట కార్యక్రమాలు చేపట్టామన్నారు.

లెర్నింగ్ లైసెన్స్‌ల అందజేత



లైసెన్స్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

రాయపర్తి : మండలకేంద్రంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత లెర్నింగ్ లైసెన్స్‌లను వినియోగించుకోవాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న లైసెన్స్ మేళాను సందర్శించారు. అనంతరం మధ్యాహ్న భోజనం తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు గబ్బెట బాబు, సర్పంచ్‌లు గారె నర్సయ్య, లేతాకుల యాదవరెడ్డి, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, గాడిపెల్లి వెంకన్న, గబ్బెట యాకయ్య, పరుపాటి రవీందర్‌రెడ్డి, నాగపురి సోమయ్య, బాషబోయిన సుధాకర్, ప్రోగ్రాం ఇన్‌చార్జిలు అశ్రఫ్‌పాషా, సంకినేని ఎల్లస్వామి, సత్తూరి నాగరాజు, గారె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం

సంగెం: హనుమకొండలోని ఏకశిల పార్కు ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు మూడు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. బుధవారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తాటికాయల కుమార్ దీక్షలకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాష్ట్రంలో సమగ్రశిక్ష ఉద్యోగులు, కేజీబీవీ, యూఆర్‌ఎస్, సీఆర్‌పీ, పీటీటీ, ఐఈఆర్‌పీ, ఎంఐఎస్, సీసీఓ, డీపీఓ, మెసెంజర్లను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. 2018 పీఆర్సీ సిఫారస్సుల మేరకు ఎంటీఎస్ వర్తింపజేయాలని, జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ బీమా రూ.5 లక్షలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు, పురుషులకు పెటర్నిటీ సెలవులు వర్తింపజేయాలని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దం వెంకట్‌రెడ్డి, సుజన్ ప్రసాద్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రమ

ఖానాపురం : మండలంలోని కొత్తూరు గ్రామంలో వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు బుధవారం పరిహారం చెక్కులను సర్పంచ్ బూస రమ అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వడగళ్ల వర్షాలతో నష్టపోయిన రైతాంగానికి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రభుత్వం నుంచి అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సామ్మెల్, నాయకులు వెంకటేశ్వర్లు, కట్టయ్య, ఏఈఓ సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



చెవ్వల సంపత్ (ఫైల్)

వర్ధన్నపేట : చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన కట్ర్యాల గ్రామంలో చోటుచేసుకుంది. వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెవ్వల సంపత్ (36) కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో ఈ నెల 28న మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి ఇంటికి వెళ్లి వాంతులు చేసుకుంటుండగా భార్య రాణి ప్రశ్నించింది. తాను జీవితంపై విరక్తి చెంది మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగానని సంపత్ చెప్పాడు. దీంతో ఆమె ఆందోళనకు గురై వెంటనే స్థానికుల సాయంతో వర్ధన్నపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం సంపత్ మృతి చెందాడు. మృతుడి భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం



గిర్నిబావిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐఎఫ్‌టీయూ(న్యూ) బాధ్యులు

దుగ్గొండి : పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం అన్నారు. మండలంలోని గిర్నిబావిలో కార్మికులతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్రం చేసిన కార్మిక చట్టాల సవరణ కోట్లాది మంది కార్మికుల శ్రమదోపిడికి కారణమవుతుందన్నారు. కార్మికులంతా ఒక్కతాటిపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు అవిశ్రాంత పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రాంతీయ కమిటీ ఎన్నిక

గిర్నిబావి ఏరియా ఏఐఎఫ్‌టీయూ(న్యూ) ప్రాంతీయ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాదం రవి, ఉపాధ్యక్షుడిగా చిరంజీవి, సూరయ్య, కార్యదర్శిగా తుమ్మలపెల్లి అజయ్, సహాయ కార్యదర్శులుగా పోశాలు, సురేందర్, కోశాధికారిగా రాజు ఎన్నికకాగా పలువురు సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



దుగ్గొండి: బోనాలతో వెళ్తున్న మహిళలు

దుగ్గొండి : మండలంలోని పలు గ్రామాల్లో పోచమ్మ బోనాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో మహిళలు బోనాలు అలంకరించుకుని డప్పు చప్పుళ్లతో పోచమ్మ ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించారు.

గీసుకొండ : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పోచమ్మతల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



పరామర్శిస్తున్న వెంకటేశ్వర్‌రావు తదితరులు

సంగెం : మండలంలోని గవిచర్ల గ్రామానికి చెందిన బయగోని రామస్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా రామస్వామి మృతదేహంపై బుధవారం బీజేపీ నాయకుడు డాక్టర్ కాళి ప్రసాద్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. రాజ్‌కుమార్, బుట్టి కుమారస్వామి, వాసం సురేష్, కూస చంద్రయ్య పాల్గొన్నారు.

రూ.5వేల ఆర్థికసాయం..

సంగెం మండలంలోని నార్లవాయికి చెందిన దామెర సారమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల సాయం అందించారు. పసునూరి సారంగపాణి, సుదర్శన్‌రెడ్డి, మాదినేని కోటి, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండ గ్రామానికి చెందిన తురపాటి రవి, చిల్ల సన్యాసి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా సర్పంచ్ గటిక సుష్మమహేష్ బాధిత కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించి సంతాపం తెలిపి ఆర్థిక సాయం అందజేశారు.

పరామర్శ

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్ గ్రామానికి చెందిన యశోదమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా బాధిత కుటుంబాన్ని రెడ్డి సంఘం నాయకులు బుధవారం పరామర్శించారు. చల్లా వెంకట్‌రెడ్డి, రాంనర్సింహారెడ్డి, రెడ్డి నాగార్జున్ రెడ్డి, అప్పిరెడ్డి, పిచ్చిరెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల సాధనకు పోరాటం



మాట్లాడుతున్న షరీఫ్

వర్ధన్నపేట : దివ్యాంగుల హక్కుల పరిరక్షణ కోసం భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఆవిర్భవించిందని సమితి జిల్లా అధ్యక్షుడు షరీఫ్ అన్నారు. పరిరక్షణ సమితి ఆవిర్భావ వేడుకలు బుధవారం ఇల్లంద గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, వృద్ధులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. దివ్యాంగుల ఆత్మగౌరవం, హక్కులు, రాజ్యాధికారం కోసం సమితి పోరాడుతోందని తెలిపారు. ఇల్లందలో అకాల వర్షాలకు దివ్యాంగురాలు శంకపల్లి ప్రమీల ఇల్లు కూలిపోయిందని, గృహలక్ష్మి పథకం కింద ఆమెకు ఇల్లు మంజూరు చేయాలని కోరారు. దివ్యాంగుల చట్టం 2016 సెక్షన్ 24/1 ప్రకారం ప్రభుత్వ పథకాల్లో 25 శాతం రిజర్వేషన్ ఉందన్నారు. ప్రస్తుతం ఇస్తున్న ఐదు శాతంతో కలిపి మరో 20 శాతం ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కందుల రమాదేవి, గౌరవ సలహాదారు సుదమల్ల రంజిత్‌నాథ్, రాయపర్తి మండల అధ్యక్షుడు ఇస్లావత్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

సంగెం : నిత్యావసర గ్యాస్ సిలిండర్ ధర తగ్గించడంతో బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి మాట్లాడుతూ సామాన్యులపై భారం పడకుండా సిలిండర్‌కు రూ.200లు, దీపం లబ్ధిదారులకు రూ.400ల చొప్పున తగ్గించడం సంతోషకరమన్నారు. భూక్యా వెంకన్న, జక్క చేరాలు తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ పరికరాలు పెంచాలి



పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న ప్రజలు

పర్వతగిరి : పోస్టాఫీస్‌లో పింఛన్ల పంపిణీ కోసం బయోమెట్రిక్ పరికరాలను పెంచాలని సర్పంచ్ చింతపట్ల మాలతిసోమేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రంగు కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం పింఛన్ల కోసం వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పింఛన్ల పంపిణీపై ఏర్పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పోస్టల్ అధికారులు సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఇజ్జగిరి సాంబరాజు, శ్రీకాంత్, అజయ్ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగయ్య

నర్సంపేట : నర్సంపేటలో సెప్టెంబర్ 1, 2వ తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం సీపీఎం పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అర్హులైన పేదలందరికి డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని ఏళ్లు గడిచిన ఇప్పటి వరకు ఏ ఒక్కరికి కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో వేలాది మంది పేదలు అనేక సంవత్సరాలుగా ఇంటి స్థలాలు లేక కిరాయి ఇళ్లలో ఉంటూ జీవనం కొనసాగిస్తూ అద్దెలు చెల్లించలేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తామని శంకుస్థాపనలు చేసి ఆ ప్రాంతంలో తట్టెడు మట్టి కూడా తీసిన పరిస్థితి లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది పేదలు ఇంటి స్థలాలు ఉన్నప్పటికి వారికి నిర్మించుకునే స్తోమతలేక ఇల్లు నిర్మించకుండా పూరి గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఇంటి స్థలం ఉన్న వారికి రూ.5లక్షలు ఇస్తామని చెప్పి, ఆ తర్వాత అసెంబ్లీలో రూ.3లక్షలు ఇస్తామని చెప్పి ఏ ఒక్కరికి ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా పేదలు వేసుకున్న గుడిసెలకు కనీస సౌకర్యాలు కల్పించి పట్టాలు ఇచ్చి డబుల్ బెడ్రూం నిర్మించి ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డమీది బాలకృష్ణ, ఇప్ప సతీష్, హన్మకొండ సంజీవ, తోటకూరి రాజేష్, ఐటిపాముల వెంకన్న, జార్జ్‌విక్టర్, వీరన్న, బాబు, తదితరులు పాల్గొన్నారు.

రక్షాబంధన్ వేడుకలు



ఎమ్మెల్యే పెద్దికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీస్

నర్సంపేట : రక్షాబంధన్ సందర్భంగా బ్రహ్మకుమారీస్ బృందం బుధవారం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్నచెల్లెలు, అక్కతమ్ముళ్ల ఆత్మీయతకు, అనురాగాలకు ప్రతీకగా జరుపుకునే పండుగ రక్షాబంధన్ అన్నారు. అనంతరం నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



శాంతికుమార్‌కు రాఖీ కడుతున్న వైఎస్ షర్మిల

నాడెం శాంతికుమార్‌కు రాఖీ కట్టిన షర్మిల

వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రక్షాబంధన్ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాడెం శాంతికుమార్‌కు బుధవారం రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిలకు శాంతికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

చెన్నారావుపేటలో..



చెన్నారావుపేట: రాఖీ కడుతున్న విద్యార్థినులు

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్‌లో బుధవారం రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులకు రాఖీలు కట్టారు.

పర్వతగిరిలో..

పర్వతగిరి : మండల కేంద్రంలోని విశ్వజెనిత్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో బుధవారం రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రిన్సిపాల్‌కు రాఖీ కట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గీసుకొండ : గొర్రెకుంట పాఠశాలలో చెట్టుకు రాఖీ కడుతున్న విద్యార్థినులు

వృక్షాలకు రక్షా బంధన్

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. కాగా పాఠశాల ఆవరణలో ఉన్న చెట్లకు విద్యార్థినులు రాఖీలు కట్టి పర్యావరణ పరిరక్షణకు వృక్షాల ప్రాముఖ్యతను చాటి చెప్పారు. హెచ్‌ఎం పి.అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీలను విస్మరిస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న ప్రసాద్

వర్ధన్నపేట : సీఎం కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి ధనార్జనే ధ్యేయంగా పాలన చేస్తున్నారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పనస ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని ఇల్లందలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పూర్తిగా కుటుంబ పాలన కొనసాగిస్తుందని తెలిపారు. డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల సాగు భూమి, ముఖ్యమైన అంశాలను పక్కన పెట్టి అన్ని ప్రచారాల ఆర్భాటాలకే పరిమితమై మళ్లీ ఇప్పుడు ప్రజలను మోసం చేయడానికి కొత్త ఎత్తుగడలతో ముందుకు వస్తున్నారని అన్నారు. దళిత బంధు పథకం ఎంత మందికి ఇచ్చారని ప్రశ్నించారు. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరెల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం

రాయపర్తి : పాలకుర్తి మండలంలోని వల్మిడి గ్రామంలో నిర్మించి ప్రారంభించబోతున్న సీతారామస్వామి ఆలయ ప్రతిష్ఠను విజయవంతం చేయాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ కోరారు. బుధవారం మండలంలోని కొలన్‌పల్లి, ఆరెగూడెం తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మధు, సారంగం, నాయకులు పాల్గొన్నారు.